సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 12 । ఆగస్టు । 2025



వర్షాభావంతో రైతు దిగాలు
పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో వర్షాభావ సమస్య నెలకొంది. భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నాయి.
8లో ▸



ఎఫ్ఏ-1 తీరుపై అసంతృప్తి
జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన ఎఫ్ఏ-1 పరీక్షల తీరుపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
8లో ▸



వీధి కుక్కల దాడి
భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేసి పలువురిపై దాడి చేశాయి.
8లో ▸

న్యూస్‌రీల్

రేపు వైఎస్ జగన్ పర్యటన షెడ్యూల్ ఇలా..

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భీమవరం విచ్చేయనున్నారు. ఉంగటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. జగన్ పశ్చిమగోదావరి జిల్లా పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. 13న మధ్యాహ్నం 3.15 గంటలకు తాడేపల్లిలోని నివాసం వద్ద నుంచి 3.20 గంటలకు హెలీప్యాడ్‌కు వస్తారు. 3.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4.15 గంటలకు భీమవరంలోని వీఎస్ఎస్ గార్డెన్స్ సమీపంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గం గుండా 4.35 గంటలకు వివాహ వేదిక వీఎస్ఎస్ గార్డెన్‌కు చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం 5.10 గంటలకు హెలీప్యాడ్ నుంచి తాడేపల్లి బయలుదేరి వెళతారు.

పాములపర్రు సమస్యను పరిష్కరించాలి



పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: మండలంలోని పాములపర్రులో జరుగుతున్న శ్మశాన వాటికలో రోడ్డు నిర్మాణ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సోమవారం పెదఅమిరం లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాములపర్రులో దళితులపై దాడి ఘటన బాధాకరమన్నారు. శ్మశాన వాటిక వంటి సున్నిత అంశాల్లో అధికారులు మరింత జాగ్రత్త తీసుకుంటే బాగుండేదని అన్నారు. ఎవరి మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతినకుండా నిర్ణయం తీసుకోవాలన్నారు. దళితుల సమస్య పరిష్కారానికి అన్ని పార్టీలు ముందుకు రావాలని కోరారు. దళితులకు న్యాయం జరిగేలా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. ఘటనను నిశితంగా పరిశీలిస్తున్నామని, పార్టీ అధినాయకులకు సమాచారం అందించామన్నారు. అధికార పార్టీ వారు ముందుకు వస్తే తాము కూడా ముందుకు వస్తామని, సమస్యను పరిష్కరించేలా కృషి చేద్దామని పీవీఎల్ అన్నారు.

గుంతలు పూడ్చివేత



కాళ్లలో రాష్ట్ర రహదారిపై గుంతలు పూడ్చుతున్న దృశ్యం

సాక్షి స్పందన

కాళ్ల: రాష్ట్రీయ రహదారిపై కాళ్ల పరిధిలో హైస్కూల్ సమీపంలో గుంతలను పూడ్చారు. 'గుంతలు పూడ్చండి.. చింతలు తీర్చండి' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. హైస్కూల్ సమీపంలోని టర్నింగ్‌లో గుంతలను సోమవారం పూడ్చించారు.

పరిష్కారంలో జాప్యం తగదు



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ

భీమవరం: పోలీసు శాఖకు వచ్చే ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా 12 మంది నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్‌ను కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆవిష్కరించారు. నులి పురుగులతో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని, వీటిని నివారించడం ద్వారా ఆరోగ్యం సమకూరుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పిల్లలకు మాత్రల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. డీఎంహెచ్ఓ జి.గీతాబాయి, ఆర్‌బీఎస్‌కే పీఓ సీహెచ్ భావన తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి నిర్లక్ష్య రోగం

ఆస్పత్రులకు సుస్తీ
- వేళకు విధులకు హాజరు కాని వైద్యులు
- పూర్తిస్థాయిలో సరఫరా అవ్వని మందులు
- సేవల కోసం రోగుల పడిగాపులు
- ఓపీ నమోదుకు తప్పని తిప్పలు
- వేధిస్తున్న వైద్య సిబ్బంది కొరత
- గగనంగా అత్యవసర వైద్యం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ చీటీ కోసం వేచి ఉన్న రోగులు, సహాయకులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి, భీమవరం: ప్రభుత్వ ఆస్పత్రులకు కూటమి సర్కారు నిర్లక్ష్య రోగం పట్టింది. సమయ పాలన పాటించని వైద్యులు.. అరకొర మందులు.. వైద్య సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమి.. రోగులకు చుక్కలు చూపిస్తున్నాయి.. ఓపీ వద్ద నుంచే పడిగాపులు మొదలవుతున్నాయి. అడుగడుగునా సమస్యలతో అత్యవసర వైద్యం గగనమవుతోంది. సోమవారం జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 'సాక్షి' జరిపిన పరిశీలనలో సకాలంలో వైద్యులు రాక రోగుల పడిగాపులు, సిబ్బంది కొరతతో వారంలో మూడు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటున్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, దీర్ఘకాల వ్యాధులకు చెందిన మందులు సైతం అందుబాటులో లేని పరిస్థితులు, పారిశుద్ధ్య లేమి తదితర వెతలెన్నో వెలుగుచూశాయి.

తణుకు.. 'ఓపి'క పట్టలేక : తణుకులోని జిల్లా కేంద్ర ఆస్పత్రి 200 పడకలతో సేవలందిస్తున్నా 100 పడకలకు చెందిన వైద్య సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఓపీ వద్ద నుంచే రోగులను కష్టాలు వెంటాడుతున్నాయి. డేటా ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యమై క్యూలైన్‌లో నిల్చోలేక కూలబడిపోతున్నారు. హెల్ప్‌డెస్క్ లేక ఏ పరీక్షకు ఎక్కడకు వెళ్లాలనే విషయం తెలియక తికమకపడుతున్నారు. పూర్తిస్థాయిలో చీపుర్లు, బ్లీచింగ్ పౌడర్, చేటలు, బయోమెడికల్ కవర్స్, శానిటరీ సామగ్రి సరఫరా లేక తరచూ పారిశుద్ధ్య లేమి పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇరగవరం, రేలంగి పీహెచ్‌సీల్లోని వైద్యులు వేళకు రావడం లేదనే ఆరోపణలున్నాయి. అత్తిలి పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేక రేలంగి పీహెచ్‌సీ నుంచి వారానికి మూడు రోజులు వస్తున్నారు. మంచిలి పీహెచ్‌సీలో ఫార్మాసిస్ట్ లేక అత్తిలి పీహెచ్‌సీ నుంచి మూడు రోజులు వస్తున్నారు.



రేలంగి పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ



పాలకొల్లు ఏరియా ఆస్పత్రిలో బాలింతల వార్డులో పరిస్థితి



పాలకొల్లు ఆస్పత్రిలో ఉదయం 11.30 గంటలైనా రాని దంత వైద్యులు

భీమవరం.. సౌకర్యాలు గగనం
జిల్లా కేంద్రం భీమవరంలోని ఏరియా ఆస్పత్రిలో జనరల్, బాలింతల వార్డుల్లో తాగడానికి మంచి నీటి సౌకర్యం లేదు. నాలుగు ఏసీలు ఉండగా ఒకటి పనిచేయడం లేదు. టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయి. ఎక్స్‌రే, స్కానింగ్‌ల్లో ఇద్దరు టెక్నీషియన్లకు ఒక్కరే ఉన్నారు. ఈసీజీ టెక్నీషియన్ లేదు. ఓపీ వద్ద కూర్చునేందుకు సరిగా బల్లలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

పాలకొల్లు.. రోగుల ఘొల్లు : పాలకొల్లు ఏరియా ఆస్పత్రిలో సమయానికి వైద్యులు రాకపోవడంతో రోగులు క్యూలైన్‌లో బారులు తీరి పడిగాపులు కాస్తున్న పరిస్థితి. గర్భిణులు, బాలింతల వార్డు అధ్వానంగా ఉంది. 23 మంది వైద్యులకు 21 మంది వైద్యులు ఉన్నారు. ఎక్స్‌రే, ఈసీజీలు ఉన్నా స్కానింగ్ కోసం బయటకు వెళ్లాల్సిందే. కొందరు వైద్యులు సెలవుపై వెళ్లడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

తాడేపల్లిగూడెం.. మందుల కొరత
తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉంది. స్కానింగ్‌లు బయటకు రాస్తున్నారు. దంత వైద్యానికి వచ్చే వారికి పళ్లు చెక్ చేయడానికి సరైన పరికరాలు లేవు. వెంకట్రామన్నగూడెం, మాధవరం పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్లు వారానికి మూడు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. పెంటపాడు మండలంలో షుగర్, బీపీ మాత్రలు అందుబాటులో ఉండటం లేదు. నాలుగు నెలలుగా 104 ద్వారా సరఫరా నిలిచిపోయినట్టు రోగులు చెబుతున్నారు.

నరసాపురం.. సిబ్బంది లేమి
నరసాపురం పట్టణంలోని రెండు పీహెచ్‌సీల్లో అసౌకర్యాలు వెంటాడుతుండటంతో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. రూరల్‌లోని ఎల్‌బీచర్ల, తూర్పుతాళ్లు పీహెచ్‌సీల్లో ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ అసిస్టెంట్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొగల్తూరు పీహెచ్‌సీలో 19 మంది ఏఎన్ఎంలకు 12 మంది మాత్రమే ఉన్నారు. ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గర్భిణులకు ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండాల్సిన స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉండి.. సమస్యలు దండి
ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు సీహెచ్‌సీలో షుగర్ మాత్రలు, ఇన్సులిన్ కొరత ఎక్కువగా ఉంది. సీహెచ్‌సీతో పాటు పెదకాపవరం, ఉండి, యండగండి పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. పాలకోడేరు పీహెచ్‌సీకి అధిక సంఖ్యలో రోగులు రాగా ఇద్దరు వైద్యులకు ఒక్కరే విధులకు హాజరయ్యారు. దీంతో గర్భిణులు, రోగులు వేచి ఉండాల్సి వచ్చింది.

ఆచంట.. క్షీణించిన పారిశుద్ధ్యం
ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ సీహెచ్‌సీలో పారిశుద్ధ్యం లోపించింది. సీహెచ్‌సీ చుట్టూ రోడ్డు సరిగాలేక బురదమయంగా మారడంతో రాకపోకలకు రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో లేని మందులను బయటి నుంచి తెప్పించి ఇస్తుండటంతో అప్పటివరకు రోగులు వేచి ఉండాల్సి వస్తుంది. జనరల్ మెడిసిన్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ సిబ్బంది కొరతతో మిగిలిన వైద్య సిబ్బందిపై పనిభారం పడుతోంది.

వైద్యుల కొరత ఇలా..

ఆస్పత్రి	మంజూరు	పనిచేస్తున్నవారు	ఖాళీలు
తణుకు జిల్లా ఆస్పత్రి	34	27	7
నరసాపురం ఏరియా ఆస్పత్రి	23	18	5
పాలకొల్లు ఏరియా ఆస్పత్రి	23	21	2
భీమవరం ఏరియా ఆస్పత్రి	23	18	5
తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి	23	16	7
ఆచంట సీహెచ్‌సీ	8	6	2
ఆకివీడు సీహెచ్‌సీ	8	6	2
పెనుగొండ సీహెచ్‌సీ	8	7	1

జిల్లాలో ఆస్పత్రులు

జిల్లా ఆస్పత్రి	1
సీహెచ్‌సీలు	3
ఏరియా ఆస్పత్రి	5
పీహెచ్‌సీలు	34
యూపీహెచ్‌సీలు	18
రోజుకు సగటున ఓపీ	15,285

ఇన్సులిన్ ఇవ్వడం లేదు



ఆకివీడు సీహెచ్‌సీలో రెండు నెలల నుంచి సుగర్ మాత్ర ఒక్కటే ఇస్తున్నారు. రెండో మాత్ర లేదంటున్నారు. చాలా ఇబ్బందిగా ఉంది. ఇన్సులిన్ ఇవ్వడం లేదు. బయట కొనుగోలు చేయాలంటే ఖరీదు ఎక్కువ, ఆర్థిక భారంగా ఉంది. పేదలకు ఇన్సులిన్ అందుబాటులోకి తీసుకురావాలి.
– కె.భాగ్యలక్ష్మి, షుగర్ బాధితురాలు, ఆకివీడు

చాలా ఇబ్బంది పడుతున్నా..



మాది నరసాపురం. నాకు షుగర్. ఉదయం, రాత్రి ఇన్సులిన్ చేసుకోవాలి. నరసాపురం ప్రభుత్వాస్పత్రిలో ఇంజక్షన్ బాటిల్ అడిగితే లేవంటున్నారు. దీంతో పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి వస్తున్నా. ఇంజక్షన్ కోసం మూడు రోజులకోసారి ఇక్కడకు రావడం చాలా ఇబ్బందిగా ఉంది.
– దేవి నాగేశ్వరరావు, షుగర్ బాధితుడు, నరసాపురం

శ్మశాన భూమి హద్దులు మార్చేందుకు కుట్ర

దళిత మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న దళిత మహిళలు

ఉండి: పాములపర్రు ఘటనలో శ్మశాన వాటిక భూమి రికార్డుల తారుమారుపై పంచాయతీ కార్యదర్శి అప్పారావును నిలదీసేందుకు వెళ్లిన దళిత మహిళలకు నిరాశ ఎదురైంది. శ్మశాన భూమిపై వాదోపవాదాలు, దళితులపై దాడి జరిగిన ఘటనల నేపథ్యంలో గ్రామానికి కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి శ్మశాన భూమి సరిహద్దులు మార్చాలంటూ పంచాయతీ పాలకవర్గానికి, దళితులకు సమాచారం లేకుండా తహసీల్దార్‌కు లేఖ రాశారు. దీంతో అధికారులు ఆఘమేఘాలపై శ్మశాన భూమి సరిహద్దులు మార్చేయడంపై దళితులు ఉలిక్కిపడ్డారు. దీనిపై ఆరా తీసేందుకు సోమవారం ఉదయం పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా పంచాయతీ కార్యదర్శి రాలేదు. కార్యాలయంలో ఉన్న సచివాలయ ఉద్యోగులు తమకేమీ తెలియదని చెప్పారు. కార్యదర్శికి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో సాయంత్రం వరకు కార్యాలయం వద్దనే కూర్చుని దళిత మహిళలు తిరిగి వెళ్లిపోయారు. పంచాయతీ కార్యాలయంలో తమకు సమాధానం చెప్పేవారే లేరని, అధికారులు చిన్నచూపు చూస్తున్నారంటూ దళిత మహిళలు ఆరోపించారు. శ్మశానంలో రోడ్డు వేయాలని పట్టుదలకు పోవడంతో రికార్డులు తారుమారుతో కుట్ర జరుగుతుందనే అనుమానం కలుగుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ శ్రీనివాస్‌ను ఆరా తీయగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు కలిసిపూడి, పాములపర్రు రెండు పంచాయతీల బాధ్యతలు ఉన్నాయని, సోమవారం కలిసిపూడిలో ఉన్నారన్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి కూడా వచ్చి వెళ్లారని చెప్పారు.

ఏపీలో ఉన్నది ప్రజాస్వామ్యమా? రాచరికమా?

మాజీ మంత్రి కారుమూరి మండిపాటు



మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా.. రాచరిక వ్యవస్థ నడుస్తోందా అనే సందేహాలు ప్రజల్లో సైతం వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో జెడ్పీటీసీ ఎన్నికల్లో పట్టు కోసం కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీతో పాటు పార్టీ శ్రేణులపై దాడికి దిగి నీచపు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఒక గ్రామానికి చెందిన ఓటర్లు మరో గ్రామం వెళ్లి ఓటేయాల్సిన పరిస్థితులను ఎప్పుడైనా చూశామా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఓట్ల శాతాన్ని తగ్గించేందుకు ఇటువంటి కుట్రలకు దిగుతోందని మండిపడ్డారు. పోలీసులు వారికి తొత్తులుగా మారారని, డీఐజీ స్థాయి అధికారి వెటకారంగా మాట్లాడటం హేయమన్నారు. పులివెందులలో బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌తో చంద్రబాబుకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు.

ఈవీఎం ముఖ్యమంత్రి.. ఈవీఎం ఎమ్మెల్యేలు
రాష్ట్ర ప్రజలంతా కూటమి ప్రభుత్వాన్ని ఈవీఎం ప్రభుత్వంగా భావిస్తున్నారని, ఈవీఎం సీఎం గాను, ఈవీఎం ఎమ్మెల్యేలు గాను అంటున్నారని కారుమూరి అన్నారు. ఈవీఎం స్కామ్ గురించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం ముందుగానే అనుమానం వ్యక్తం చేశారన్నారు. ఈవీఎం మిషన్లు చూపించిన ఓటింగ్‌కు, ఈవీఎం ప్యాడ్‌ల సంఖ్యకు భారీగా తేడా వచ్చినా ఎన్నికల అధికారులు పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వానికి వంతపాడారని విమర్శించారు. వీటన్నింటిపై పార్టీ తరఫున న్యాయస్థానానికి వెళ్లినట్టు చెప్పారు. 45 ఏళ్ల ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబు తనకు ఓట్లు వచ్చినచోట అభివృద్ధి చేయాల్సింది గాను, వైఎస్సార్‌సీపీ వాళ్లకు ఏ పనులూ చేయరాదని అధికారులకు సూచించడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టించి సంక్షేమం అందిస్తామని చెప్పి, ఇప్పుడు పీ4 విధానాన్ని అమలుచేస్తున్నామంటూ చేతులెత్తేశారన్నారు. ఆ పీ4 ప్రక్రియను మీ పచ్చ ఛానల్‌లోనే ఉతికి ఆరేశారంటూ గుర్తుచేశారు. తణుకులో ఆవులు, గేదెల కోతలు, బెల్టు దుకాణాలు, సెటిల్‌మెంట్‌లతో దోపిడీ జరుగుతుందని విమర్శించారు. పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో సిఫార్సు బదిలీలలు!

- బదిలీలు, పదోన్నతులపై చర్చ
- ఇప్పటికే ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలంటూ గుసగుసలు
- వేధింపులు భరించలేక భీమవరం ఎస్ఈ వీఆర్ఎస్‌కు దరఖాస్తు!



ఏలూరులో విద్యుత్ భవనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో త్వరలే జరిగే పదోన్నతులు, బదిలీలపై ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. కొందరికి పదోన్నతులు వచ్చే అవకాశం ఉండటంతో వారు పనిచేసే స్థానాలను ఆశిస్తూ ఇప్పటికే కొందరు అధికారులు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు సమర్పించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

వ్యూహాత్మకంగా పావులు
ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజుకు రానున్న జనవరిలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి లభించనుంది. దీంతో ఈ పోస్టు ఖాళీ కానుంది. అలాగే భీమవరం సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.ఝాన్సీకి ఇప్పటికే ఎస్ఈగా పదోన్నతి కల్పించాల్సి ఉంది. అయితే కొన్ని సమీకరణాల కారణంగా ఆమె స్వయంగా పదోన్నతిని వాయిదా వేసుకున్నట్టు ప్రచారం సాగుతోంది. భీమవరం ఎస్ఈ ఎ.రఘునాథబాబు ఈనెల 24 వరకూ సెలవు పెట్టారు. దీంతో ఈ స్థానానికి ఏలూరు ఎస్ఈని ఇన్‌చార్జిగా నియమిస్తూ సీఎండీ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. కాగా ఏలూరు ఎస్ఈ సాల్మన్ రాజు ఏలూరు స్థానానికి వచ్చి మూడేళ్లు ముగుస్తున్నందున ఆయన్ను తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. దీంతో ఆయనకు తొలుత భీమవరం సర్కిల్‌కు ఎఫ్ఏసీగా బాధ్యతలు ఇచ్చి, అనంతరం భీమవరం స్థానాన్ని కేటాయించడానికే వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది.

సీఎండీకి సిఫార్సు లేఖలు
ఏలూరు ఎస్ఈ స్థానం ఖాళీ అయితే భీమవరం సర్కిల్ ఈఈ (టెక్నికల్) ఝాన్సీని అక్కడికి బదిలీ చేస్తారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఆమె స్థానంలోకి (భీమవరం) కాకినాడ జిల్లా జగ్గంపేటలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను బదిలీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయంటున్నారు. ఇదిలా ఉండగా సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఎస్ఈ హోదాలో పనిచేస్తున్న ఓ అధికారి సైతం ఏలూరు ఎస్ఈ స్థానానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఆయన గతంలో ఏలూరు సర్కిల్ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేసినందున సర్కిల్‌పై పట్టు ఉండటంతో కొందరు కూటమి ఎమ్మెల్యేలు ఆయన్ను ఇక్కడ నియమించాలని పట్టుపడుతున్నట్టు తెలిసింది. అలాగే భీమవరం టౌన్ ఏఈఈగా పనిచేస్తున్న అధికారికి ఈఈగా పదోన్నతి కల్పించి ఆయన్ను జగ్గంపేట ఈఈగా నియమించే అవకాశం ఉందంటున్నారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలువురు కూటమి ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలను కూడా సీఎండీకి పంపినట్టు చర్చించుకుంటున్నారు.

వేధింపులతో..
కూటమి ఎమ్మెల్యేల వేధింపులతో ఓ అధికారి బలి అవుతున్నాడనే చర్చ ఉద్యోగవర్గాల్లో జోరుగా సాగుతోంది. వారం క్రితం టెలీ కాన్ఫరెన్స్‌లో భీమవరం ఎస్ఈ రఘునాథబాబు పనితీరుపై సీఎండీ అందరి ముందు మందలించడంతో ఆయన కినుక వహించి సెలవు పెట్టారనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు భీమవరం సర్కిల్‌లో అధిక శాతం ఓ సామాజిక వర్గానికి చెందిన అధికారులే పనిచేస్తుండటం, వారంతా రఘునాథబాబుపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేస్తూ వేధిస్తున్నారని అంటున్నారు. వీటిని భరించలేక ఆయన సీఎండీ కార్యాలయంలో స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందంటూ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

కలెక్టర్ నాగరాణి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో అర్జీల పరిష్కారంలో జిల్లా వెనుకబడి ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. మొత్తం 180 అర్జీలను స్వీకరించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..
- భీమవరం 12 వార్డు బ్రిడ్జి పేట పంట కాలువ పక్క రోడ్డును ఆనుకుని 40 ఏళ్లగా నివాసం ఉంటున్నామని, రోడ్డు విస్తరణలో మా ఇళ్లు తొలగించారని ఈ ప్రాంత వాసులు కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు.
- పాలకోడేరు మండలం కొరుకోల్లులోని దళితపేటలో ప్రభుత్వానికి చెందిన 2 సెంట్ల భూమి ఎస్సీ కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించగా అధికారులు ఇంటి స్థలంగా పట్టాలు ఇచ్చారని దళితపేటవాసులు ఫిర్యాదు చేశారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం
ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, మాలల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ వద్ద మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

దేశ సమైక్యతకు పాటుపడాలి
భీమవరం: యువత దేశ సమగ్రత, సమైక్యతకు పాటుపడాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. సోమవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ కళాశాల వద్ద ఆమె ప్రారంభించారు. ఈనెల 13 నుంచి 15 వరకు ఇళ్లు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో జెండాలను ఎగురవేయాలని ఆమె అన్నారు. అనంతరం సుమారు 2 వేల మంది విద్యార్థులతో 200 మీటర్ల భారత త్రివర్ణ పతాకాన్ని చేతబూని ర్యాలీ నిర్వహించారు.

వర్షాభావంతో రైతు దిగాలు

- వేసవిని తలపిస్తున్న ఎండలు
- సరైన వానలు లేక మరింత లోతుకు భూగర్భ జలాలు



ఏలూరు (మెట్రో): పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో వర్షాభావ సమస్య నెలకొంది. భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. సాగు పనులు 60 శాతం పూర్తి కావాల్సి ఉండగా సరైన వర్షాలు లేక ప్రస్తుతం 30 నుంచి 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.పూర్తిస్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఈ సంవత్సరం సాగు చేసుకోవాలా, వద్దా అన్న సందిగ్ధంలో రైతు ఉన్నాడు.

పశ్చిమగోదావరి జిల్లాలో గత నెలలో 246.5 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 128.88 మీ.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. జూన్ నెల నుంచి ఆగస్టు 4 నాటికి 365.99 మిమి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 254.04 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది.

మెట్ట ప్రాంతంగా ఉన్న ఏలూరు జిల్లాలోనూ ఇదే దుస్థితి నెలకొంది. గత జూలైలో 242.52 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 179.81 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. ఆగస్టు నెల ఆరంభం నుంచి గత 10 రోజులుగా సాధారణ వర్షపాతం 81.45 మిమి నమోదు కావాల్సి ఉండగా కేవలం 21.54 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. సరాసరి జూన్ నెల నుంచి ఆగస్టు 10 నాటికి పరిశీలిస్తే 438.28 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 274.69 మి.మీ వర్షపాతం నమోదైంది. పూర్తిగా మెట్ట ప్రాంతం, బోర్లు, వర్షాధారంపైనే ఏలూరు జిల్లా రైతులు ఆధార పడ్డారు. భారీ వర్షాలను ఏలూరు జిల్లా రైతులు ఆశిస్తారు. భారీ వర్షాలు కురిస్తేనే మెట్ట ప్రాంతంలో జలాశయాలు, చెరువులు పూర్తిస్థాయిలో నిండుతాయి. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో పంటలు వేసేందుకు రైతులు జంకుతున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

భూగర్భ జలాలు రోజురోజుకూ కిందికి వెళ్లిపోతున్నాయి. డెల్టా ప్రాంతంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో గతేడాది జూలైలో 8.9 మీటర్ల స్థాయిలో ఉన్న భూగర్భ జలాలు 9.54 మీటర్ల లోతుకు వెళ్లాయి. ఏలూరు జిల్లాలో గతేడాది జూలైలో 20.26 మీటర్లుగా ఉన్న భూగర్భ జలాలు ప్రస్తుత జూలైలో 21.98 మీటర్ల లోతుకు చేరాయి. వర్షాకాలం ఆరంభంలోనే ఇలా ఉంటే మున్ముందు ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇలాగైతే సాగు ఎలా?



వర్షాలు కురవక సాగుకు వీలు లేకుండా పోతుంది. వర్షాకాలం ఆరంభంలోనే సమృద్ధిగా కురిస్తే సాగు పనులకు వీలుంటుంది. ప్రస్తుతం వర్షాకాలం వేసవిని తలపిస్తోంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలవుతున్నా.. సమృద్ధిగా వర్షాలు కురిసిన పాపాన పోలేదు.

– దేవళ్లరాజు రాజశేఖర్, రైతు, కొండలరావుపాలెం

ఉక్కబోతతో ఇక్కట్లు



ఎండలు వేసవిలో మండినట్లు మండిపోతున్నాయి. దీనికి తోడు ఉక్కబోత. పగలు ఎండలు మండిపోతుంటే రాత్రి సమయంలో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వర్షాలు కురిస్తే కాస్త ఉపశమనం కలుగుతుంది.

– శ్రీరామ శ్రావణి, కొవ్వలి, గృహిణి

ఎఫ్‌ఏ-1 నిర్వహణ తీరుపై అసంతృప్తి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన ఎఫ్‌ఏ-1 పరీక్షలు ఉపాధ్యాయులకు పరీక్ష పెడుతున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి విద్యాశాఖాధికారులు అనుసరిస్తున్న విధానాలతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఎఫ్‌ఏ -1 పరీక్షలకు ఇవ్వాల్సిన ప్రశ్నా పత్రాలను సంబంధిత క్లస్టర్ పాఠశాలల నుంచి పరీక్షకు కేవలం గంట ముందు తీసుకువెళ్ళాలని ఆదేశించారు. ఈ విధానం వల్ల కొన్ని పాఠశాలలు క్లస్టర్ పాఠశాలలకు సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, అక్కడికి వెళ్ళి ప్రశ్నాపత్రాలు తీసుకువెళ్ళడం ఉపాధ్యాయులకు కష్టతరమవుతోందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ పూట ప్రశ్నా పత్రాలు ఆ పూట తీసుకువెళ్ళాల్సి రావడంతో ఉపాధ్యాయులు రెండు పూటలా అక్కడకి వెళ్ళి రావడం ఇబ్బందికరమంటున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకూ ఉండే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు 1 నుంచి 5వ తరగతి వరకూ ప్రశ్నా పత్రాల కోసం క్లస్టర్ పాయింట్‌కు ఒకరు, 6 నుంచి 10వ తరగతి వరకూ ప్రశ్నా పత్రాలను మండల రీసోర్స్ కేంద్రాల నుంచి తీసుకెళ్లడానికి మరొకరు వెళ్లాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలలు మండల రీసోర్స్ కేంద్రానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. ప్రశ్నాపత్రాలు కేవలం గంట ముందు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టడంతో పరీక్ష సమయానికి అంతదూరం నుంచి తమ పాఠశాలకు తీసుకువెళ్ళడానికి సమయం సరిపోదని చెబుతున్నారు. జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు అనేకం ఉన్నాయని, వాటిలో మహిళలు ప్రధానోపాధ్యాయులుగా ఉన్న పాఠశాలలు కూడా ఉన్నాయని, వారు ప్రశ్నాపత్రాలను దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్లస్టర్ పాఠశాలల నుంచి ప్రశ్నాపత్రాలు తీసుకురావాలంటే దాదాపు గంట సమయం పడుతుందని, ఆ గంట సేపు పాఠశాలలో విద్యార్థులను నియంత్రించే వారు ఎవరూ ఉండరని చెబుతున్నారు.

రెండు పేపర్లూ ఒకే సారి ఇవ్వాలి

ఎఫ్‌ఏ-1 పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ అనుసరిస్తున్న విధానాలు అసంబద్ధంగా ఉన్నాయి. ఏ పూట ప్రశ్నాపత్రాలు ఆ పూట తీసుకోవాలనడం దారుణం. రెండు పూటలా ప్రశ్నాపత్రాల కోసం అంతంత దూరం వెళ్ళి రావడం ఉపాధ్యాయులకు కష్టమవుతుంది. ప్రశ్నా పత్రాలు తీసుకువచ్చే క్రమంలో ఏమైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. రెండు పూటలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను ఒకేసారి ఇచ్చేయాలి.

– గుగ్గులోతు కృష్ణ, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనర్

ఎమ్మెల్యే తాలూకా..



ఏలూరు జూట్‌మిల్లు వద్ద గ్రావెల్‌తో ఉన్న టిప్పర్‌ను ఆపుతున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



ఏలూరు నగరంలో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లారీలు, ఇతర భారీ వాహనాల రాకపోకలు నిషేధం. ఈ సమయంలో వాహనాలు పొరపాటున ప్రవేశిస్తే రూ.2 వేలు అంతకు మించి అపరాధ రుసుం చెల్లించాల్సిందే.. ఇదంతా కేవలం సామాన్యులకే వర్తించే రూల్స్.. జూట్‌మిల్లు సమీపంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు వరుసగా నాలుగు లారీలు రావటంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు ఆపారు. కానిస్టేబుల్ సీఐకు సమాచారం ఇచ్చారు. మేం ఎమ్మెల్యే గారి తాలుకా మా వాహనాలే అపుతారా.. అంటూ డ్రైవర్ ఎవరికో ఫోన్ చేసి ట్రాఫిక్ పోలీసులకు ఇచ్చాడు. వెంటనే ఆ లారీలను నగరంలోకి వెళ్లడానికి అనుమతి ఇచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

వీధి కుక్కల దాడిలో గాయాలు





భీమడోలు ఆస్పత్రిలో బాలుడికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది, గాయాలతో ఆసుపత్రి వచ్చిన యువకుడు సుశాంత్

భీమడోలు: భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేసి దాడి చేశాయి. వేర్వేరు గ్రామాలకు చెందిన వీధి కుక్కల బాధితులు సోమవారం భీమడోలు ఆసుపత్రికి వచ్చారు. వారికి వైద్యులు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేసి ఇళ్లకు పంపారు. పోలసానిపల్లికి చెందిన నాలుగేళ్ల చిన్నారి షేక్ అమ్మన్, భీమడోలు పంచాయతీ శివారు ఆర్జావారిగూడెంకు చెందిన పాము సుశాంత్(24), ఉమర్(9), మాధవరానికి చెందిన మడిచారాల ఆదిలక్ష్మి(41), ఎం.నాగులపల్లికి చెందిన తులసి రామ్(34), సంద్రగుంటకు చెందిన కె.రాజు(66), గుణ్ణంపల్లికి చెందిన నక్కా చంద్రవతి(70) వీధి కుక్కల దాడిలో గాయపడ్డారు. కుటుంబ సభ్యులు భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆసుపత్రి సూపరిండెంటెంట్ ఆనంద్ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ వేశారు. ఇటీవల భీమడోలు సమీపంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలో ఓ ప్రైవేటు పాఠశాలలోకి కుక్కలు చొరబడి ముగ్గురు విద్యార్థులను కరిచాయి. గ్రామాల్లో వీధి కుక్కల సంచారం పెరిగిపోయిందని, వాటి నుంచి ప్రజలను రక్షించాలని గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోవాలి

తూర్పుగోదావరి ఎస్పీకి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు



తూర్పుగోదావరి ఎస్పీకి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేణు తదితరులు

ద్వారకాతిరుమల: మాజీ హోం మంత్రి, వైఎస్సార్‌ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనితపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు సోమవారం జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండలానికి చెందిన పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు. దళిత మహిళ అని కూడా చూడకుండా నల్లజర్ల గ్రామానికి చెందిన సవలం రామకృష్ణ ఈ నెల 7న రాత్రి తన ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి వనితను అవమానపరిచేలా పోస్టు పెట్టాడన్నారు. ఈ పోస్టును వేళ్లచింతలగూడెంకు చెందిన మద్దిపాటి మహేష్, నేకూరి చంద్రం, దేవరపల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన నగ్గిన నాగేంద్రలు షేర్‌లు చేశారన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీని కోరినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, బంకా అప్పారావు, పానమాల ఉమామహేశ్వరరావు, పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సెక్రటరీ వామిశెట్టి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోల్‌బాల్ జట్టు ఎంపిక



తణుకులో రోల్‌బాల్ స్టేట్ సెలక్షన్ క్యాంప్‌నకు హాజరైన క్రీడాకారులు

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రోల్ బాల్ స్టేట్ సెలక్షన్ క్యాంప్ ఈనెల 7 నుంచి 10 వరకు తణుకు సిల్వర్ జూబ్లీ కాలనీలోని మునిసిపల్ స్కేటింగ్ పార్కులో నిర్వహించారు. వివిధ విభాగాల్లో జాతీయస్థాయి పోటీలకు జట్టు ఎంపిక చేశారు. మొత్తం 100 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ క్యాంపులో 60 మందిని ఎంపిక చేసినట్లు రోల్ బాల్ స్టేట్ సెక్రటరీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో కేరళలోని కొల్లాంలో నిర్వహించే సౌత్ జోనల్స్‌కి జట్టును సంసిద్ధం చేశామని చెప్పారు. 60 మంది ఎంపిక కాగా.. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి తణుకుకు చెందిన 9 మంది క్రీడాకారులు ఉన్నట్లుగా వివరించారు. కార్యక్రమంలో స్టేట్ టెక్నికల్ చైర్మన్ వీజీ ప్రేమ్‌నాథ్, స్టేట్ ఆర్గనైజింగ్ డైరెక్టర్ తోట లలిత ప్రియ, కోచెస్ కమిటీ డైరెక్టర్ పూసర్ల సంతోష్ కుమార్, ఉమెన్ కమిషన్ డైరెక్టర్ వానపల్లి లావణ్య, కోచెస్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ మధుబాబు, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కోచ్‌లు పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో హత్యాయత్నం

భీమవరం: పట్టణంలోని తాలూకాఫీసు సెంటర్‌లో ఒక వ్యక్తిపై ముగ్గురు కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం పట్టణంలో కలకలం రేపింది. వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పాతగొడవల నేపథ్యంలో దేవ సాయికుమార్, మరో ముగ్గురు కోర్టు వాయిదాకు వచ్చారు. ఈ నేపథ్యంలో వారి మధ్య వివాదం రేగడంతో కత్తితో పొడిచి గాయపరిచారు. సాయికుమార్ భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఘటనకు సంబంధించి వివరాలను సీసీ ఫుటేజీ ద్వారా పరిశీలించి సురేంద్ర, వలవల గోపీ, చరణ్, వలవల సాయిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో కూటమి పార్టీకి చెందిన వ్యక్తులు ఉండడంతో కేసును రాజీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్

నూజివీడు: యోగాసన పోటీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ నెల 10న ఏలూరులోని ప్రేమాలయ ఓల్డేజ్ హోంలో జరిగిన ఈ పోటీలో 14 మంది విద్యార్థులు వేర్వేరు ఆసనాలలో 16 పతకాలను సాధించారు. 9 మంది గోల్డ్ మెడల్స్, ఆరుగురు సిల్వర్ మెడల్స్, ఒకరు బ్రాంజ్ మెడల్ సాధించడం విశేషం. జూనియర్స్ విభాగంలో తనూష, హరిత, దివాకర్‌లు గోల్డ్ మెడల్స్ సాధించగా, సీనియర్స్ విభాగంలో అశోక్, అభిషేక్, దీపక్ నాయుడు గోల్డ్ మెడల్స్ సాధించారు. హరిత, అశోక్, దీపక్ నాయుడులు యోగాసనాలలోని వివిధ ఈవెంట్లలో రెండేసి చొప్పున గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం. జూనియర్స్ విభాగంలో దేవిశ్రీ, స్పందన, ప్రమీల, వెంకటలక్ష్మి, యుగంధర్, దామోదర్‌లు సిల్వర్ మెడల్స్ సాధించగా, గీతిక అనే విద్యార్థిని బ్రాంజ్ మెడల్ సాధించింది. యోగాసనాలలో పతకాలు సాధించిన విద్యార్థులను ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ లక్ష్మణరావు, అకడమిక్ డీన్ చిరంజీవి, అకడమిక్ అసోసియేట్ డీన్ రఘు, యోగా టీచర్ పి. చంద్రశేఖర్ లు అభినందించారు.

అభయాంజనేయ స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులోని వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం 10,32,522 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. మండలంలోని మొండూరు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎం.రాంబాబు పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. 76 రోజులకు ఈ లెక్కింపు చేసినట్లు తెలిపారు.

ఆక్వా రంగ సమస్యల పరిష్కారానికి కృషి



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందిస్తున్న ప్రాన్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్

భీమవరం: ఆక్వా రంగ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వెస్ట్ గోదావరి ప్రాన్ ఫార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ మంత్రిని కలిసి ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిపై అమెరికా 50 శాతం పన్ను విధించడంతో ధరల్లో తీవ్ర వ్యత్యాసం వచ్చిందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.జగపతిరాజు, గాదిరాజు వెంకట సుబ్బరాజు వినతిపత్రం అందించారు. శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రొయ్యల రైతుల కష్టాలు తనకు తెలుసుని ఆక్వా సాగుకు గతంలో ఉన్న మంచి పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. రైతుల ఇబ్బందులను కేంద్ర మంత్రి పియూష్ గోయల్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాసవర్మ చెప్పారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



బాస్కెట్‌బాల్ పోటీలకు హాజరైన బాలికలు

ఏలూరు రూరల్: ప్రభుత్వం స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు అండర్-22 విభాగంలో మహిళలు, పురుషులకు 10 క్రీడాంశాల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నామన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన వారు జోనల్ పోటీల్లో తలపడతారన్నారు. పరిశీలకురాలిగా హాజరైన శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు శాప్ పోటీలు చేపడుతోందన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హాకీ క్రీడాంశాల్లో పోటీలు చేపట్టి జట్ల ఎంపిక పూర్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మంగరాజు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 59 షెడ్యూల్డ్ కులాలను జనాభా ఆధారంగా మూడు గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లు కేటాయించడం సరికాదని కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించినట్లు చెప్పారు. షెడ్యూల్ కులాల జాబితాలో మార్పులు చేసే అధికారం కేంద్రానికే ఉందని, రాష్ట్రానికి లేదన్నారు. ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని కోరారు.

డిగ్రీ కళాశాలల్లో బదిలీలు చేపట్టాలి



ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సాధారణ బదిలీలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బదిలీలతో పాటు అధ్యాపకుల రీ డిజిగ్నేషన్, సీపీఎస్ వంటి విషయాలపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్, గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఇచ్చిన పిలుపుమేరకు ఈ నిరసన ప్రదర్శన చేశారు. జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు, ట్రెజరర్ టీవీ దుర్గాప్రసాద్, జీజీటీఏ జిల్లా ట్రెజరర్ కే. రమేష్, ఇతర అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

బుట్టాయిగూడెంలో..

బుట్టాయగూడెం: భోజన విరామ సమయంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు నిరసన కార్యక్రమం చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ మహేంద్రరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

గుడాల గోపికి వైఎస్ జగన్ పరామర్శ



గోపిని ఫోన్‌లో పరామర్శిస్తున్న మాజీ సీఎం జగన్

వీరవాసరం: వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సోదరుడు గుడాల వెంకట సుబ్బయ్య (చిన్న) (49) అనారోగ్యంతో సోమవారం ఉదయం వీరవాసరంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో గోపిని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. అందరితో కలుపుగోలుగా ఉండే చిన్న మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. చిన్నకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. యడ్ల తాతాజీ, కర్రా జయసరిత, గాదిరాజు రామరాజు, జుత్తిగ నాగరాజు, డీవీడీ ప్రసాద్, పార్టీ నాయకులు గోపిని పరామర్శించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్, గరగపర్రురోడ్డులోని బీవీ రాజు విగ్రహం ప్రాంతాల్లో మద్యం సేవించి బైక్ నడుపుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ సోమవారం చెప్పారు. పట్టుబడిన వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని, అతి వేగంగా బైక్ నడిపిన వ్యక్తికి రూ.3 వేల జరిమానా విధించారని సీఐ కాళీచరణ్ చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

ఉండి: ఈ నెల 11న ఉండి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నమోదైన 15 కేసుల్లో ముద్దాయిలను కోర్టుకు తరలించగా సోమవారం వారికి జరిమానాలు విధించినట్లు ఉండి ఎస్సై నసీరుల్లా తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలు వీరే

భీమవరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో గాంధీజీ ఆశించిన స్వరాజ్యం అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేత వివరాలను సోమవారం ప్రకటించారు. సీనియర్స్ విభాగంలో ఎం.నాగలక్ష్మి(గోపాలపురం), ఎండీ సుమయ్య(నరసాపురం), ఎ.పూజిత(చినఅమిరం), పి.మంజుశ్రీ(గూట్లపాడు), కేఎస్.అమూల్య(వైఎస్ పాలెం), కె.రిషిత(కేఎస్ రామవరం), కె.దివ్య(మండపాక), ఎస్.అమృత లక్ష్మీసాయి(చిననింద్రకొలను) విజేతలుగా నిలిచారు. జూనియర్స్ విభాగంలో కె.కుషాలి(బొర్రంపాలెం), డి.కోమలశ్రీ(వేగివాడ కల్లచెరువు), కె.యామిని ఐశ్వర్య(నరసాపురం), ఎస్.అక్షిత(చినఅమిరం), ఎ.సరసాదేవి(అరట్లకట్ట), కె.వర్షిత(భీమవరం), పి.ఆనందిత(పెదనింద్రకొలను), కళాశాల స్థాయిలో ఎం.విజయమణి(తాడేపల్లిగూడెం), ఇ.వరుణ్(పెన్నాడ), వై.అవినాష్(భీమవరం) విజేతలుగా నిలిచారని వీరికి 13న పెద అమిరం మహాత్మాగాంధీ ట్రస్ వద్ద, ఏలూరులో 14న పెదనింద్రకొలను మహాత్మాగాంధీ భవనంలో బహుమతులు అందజేస్తారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

భీమవరం అర్బన్: మండలంలోని దెయ్యాల తిప్ప వద్ద కాళీపట్నం చానల్‌లో సోమవారం గుర్తు తెలియని మహిళ మృత దేహం కొట్టుకు వచ్చింది. స్థానికులు గమనించి వీఆర్‌వోకు సమాచారం అందించారు. రూరల్ ఐ.వీర్రాజు అక్కడికి చేరుకుని బయటకు తీయించారు. ఆమె వయసు 35 నుంచి 40 మధ్య ఉండవచ్చని నీలం టవల్ కట్టుకుని పైన తెల్లటి జాకెట్ ఉందని ఎస్సై తెలిపారు. కాలువలో ఎక్కువ రోజులు ఉండటం వల్ల గుర్తుపట్టలేని విధంగా ఉందన్నారు.

రోగులు ఫుల్.. సౌకర్యాలు నిల్!

- ప్రభుత్వ దవాఖానాల్లో అందని వైద్య సేవలు
- తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఓపీకి రోగుల పాట్లు
- 200 బెడ్లకు 100 బెడ్లకే వసతులు
- చీపుర్లు, బ్లీచింగ్ లేని వైనం
- పీహెచ్‌సీల్లో వేళకు రాని వైద్యులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- సాక్షి విజిట్‌లో బయటపడ్డ సమస్యలు


ఇరగవరం పీహెచ్‌సీలో వైద్యుడు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ


అత్తిలి పీహెచ్‌సీలో వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

తణుకు అర్బన్/ఇరగవరం/అత్తిలి: సర్కారు దవాఖానాల్లో సిబ్బంది కొరత, వేళకు రాని వైద్యుల కారణంగా రోగులకు అందాల్సిన వైద్యసేవలు కునారిల్లుతున్నాయి. వైద్యం కోసం రోగులు గంటల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ చీటీ కోసం రోగులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా ఓపీ చీటీకోసం ఆధార్ అనుసంధానం తోపాటు ఆన్‌లైన్‌లో పొందుపరిచే విధానంతో రోగులు క్యూలైన్‌లో చాలాసేపు నిలబడాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు. తీరా ఓపీ రాయించుకుని వైద్యుడి వద్దకు వెళ్లేప్పటికీ పెద్ద క్యూలైన్ ఉంటుందని గంటలతరబడి వైద్యంకోసం ఉండాల్సివస్తుందని చెబుతున్నారు. దీంతోపాటు వాస్తవానికి జిల్లా కేంద్ర ఆస్పత్రిగా 200 బెడ్లతో వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ రికార్డులపరంగా 100 బెడ్లకే వైద్య సిబ్బంది ఉండడంతో రోగులకు అందాల్సిన సేవలు జాప్యమైపోతున్నాయి. అంతేకాకుండా పారిశుధ్య నిర్వహణకు సంబంధించి రెండు నెలలకోసారి అందుతున్న సామాగ్రి సైతం 100 బెడ్లకే వస్తుండడంతో ప్రస్తుతం చీపుర్లు, బ్లీచింగ్, చేటలు, బయోమెడికల్ కవర్స్ వంటి సామాగ్రి సైతం నిండుకున్నాయి. దీంతో పారిశుధ్య కార్మికులు తమ విధుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపీ చీటీ రాయించుకున్న రోగులు, వైద్యులకు చూపించుకుని పరీక్షల కోసం వివిధ విభాగాలకు వెళ్లేవారు ఎక్కడ ఏ సేవలు ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేయాల్సిందిగా రోగులు కోరుతున్నారు. సోమవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అన్ని విభాగాల్లోను 570 మంది రోగులు వైద్యసేవల కోసం వచ్చారు.

ఇరగవరంలో..

ఇరగవరం మండలానికి సంబంధించి ఇరగవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వేళకు రావడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం సాక్షి విజిట్‌లో భాగంగా 9.30 గంటలకు కూడా వైద్యుడు ఆస్పత్రికి చేరుకోలేదు. రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా వైద్యుడు నిర్ణీత సమయానికి అందుబాటులోకి రాలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది.

అత్తిలిలో..

అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడంతో రోగులు రక్త పరీక్షలకు ఇబ్బందులు పడుతున్నారు. రేలంగి పీహెచ్‌సీ నుంచి వారానికి 3 రోజులు అత్తిలి పీహెచ్‌సీ రావాల్సిన దుస్థితి నెలకొంది. మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్ట్ లేకపోవడంతో అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 3 రోజుల పాటు మంచిలిలో విధులు నిర్వర్తిస్తున్నారు.

దంత వైద్య విభాగం అంతంత మాత్రమే

ఆసుపత్రిలో ఉన్న దంత వైద్య విభాగం సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. దంతాలు పెట్టడానికి అవసరమైన యంత్ర పరికరాలు లేకపోవడంతో ఇక్కడ దంత వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. దీంతో ఇక్కడికి దంత సమస్యలతో వచ్చిన రోగులకు పళ్లు మాత్రమే పీకి పంపిస్తున్నారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి సరైన యంత్ర పరికరాలు లేవని వైద్యులు చెబుతున్నారు. ప్రాముఖ్యత కలిగిన ఇక్కడి ఆసుపత్రికి పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాల లేమి

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలోని ప్రభుత ఏరియా ఆసుపత్రికి సుమారు ఎనిమిది మండలాల నుంచి వైద్య సేవలకు ప్రజలు వస్తుంటారు. వైద్య సేవల కోసం వచ్చిన వారికి సౌకర్యాలు లేకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఔషధాలను పూర్తి స్థాయిలో అందించడం లేదు. దీంతో కొన్ని ఔషధాలను దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ విభాగం లేకపోవడంతో అత్యవసర వైద్య సేవల నిమిత్తం వచ్చే వారికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు స్కానింగ్ తీయించుకురమ్మని ప్రైవేట్ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తున్నారు. అక్కడ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో నిరుపేదలైన ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మందులతో సరిపెట్టుకొంటున్నారు.

చంద్రబాబు అంటేనే మోసం


చంద్రబాబు చేసిన మోసం బ్రోచర్‌ను చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇరగగరం: మండలంలోని ఇరగవరం శివారు ప్రాంతాలు గుబ్బలవారి పాలెం, గొల్లమాలపల్లిలో మంగళవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చి బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందనేది వివరించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ ఉచిత బస్సు, 50 ఏళ్లకే పింఛన్ వంటి హామీలను ఏ మాత్రం అమలు చేయలేదన్నారు. మేము పెద్ద ఎత్తున పోరాటం చేస్తే ఒకటి, రెండు హామీలు నేరవేర్చారని, అవి కూడా పూర్తిగా అమలు చేయకుండా కొంత మందికే పరిమితం చేశారన్నారు. కరెంటు బిల్లులను సాకుగా చూపి పథకాలకు మంగళం పాడుతున్నారని అని పేర్కొన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలన్నారు. అవి నేరవేర్చే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఉప సర్పంచ్ కోటిపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ మంగిన రామానాయుడు, మండల బీసీ సెల్ నాయకులు కుడిపూడి సత్యనారాయణ, వీరవల్లి గణపతి, వీరవల్లి జోగేశ్వరరావు, ప్రవీణ్ గోవింద్ గుత్తుల శ్రీనివాస్, సత్యనారాయణ,గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ఐదు అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం: పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు అర్జీదారులు టౌన్ ప్లానింగ్‌కు 3, ఇంజనీరింగ్ సెక్షన్‌కు 1, పింఛన్ 1, మొత్తం 5 అర్జీలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎంఈ వైవీ రమణ, ఏసీపీ జి.సీతారాం, మేనేజర్ ఎం.రవి సుధాకర్, డాక్టర్ ఎస్.రాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్య, జ్ఞానాన్ని సమాజానికి ఉపయోగించండి


మొదటి సంవత్సరం కొత్త బ్యాచ్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం: విద్యలో సత్ ప్రవర్తన, క్రమశిక్షణ, బాధ్యతగా ఉంటూ విద్య, జ్ఞానాలను సమాజానికి ఉపయోగించాలని శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ వైస్ చైర్మన్ మేక నరేంద్ర కృష్ణ, సెక్రటరీ మేక క్రాంతి సుధ, ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థుల కొత్త బ్యాచ్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు మార్గదర్శక ఉపన్యాసాలు అందించారు. విభాగాధిపతి డాక్టర్ టి.రఘు, స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాటివ్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి


పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో ఎం.శ్రీనివాస్

పెంటపాడు: ఫార్మాటివ్ పరీక్షలను ఉపాధ్యాయులు సజావుగా నిర్వహించాలని ఎంఈవో శ్రీనివాస్ కోరారు. పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలలో సోమవారం నుంచి ఫార్మాటివ్ పరీక్షలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈవో ఎం.శ్రీనివాస్ ఈ పరీక్షలను తనిఖీ చేశారు. మూల్యాంకన, ప్రశ్న పత్రాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం రాజేష్, జి.సాయిరాం, డి.పద్మజ, పి.సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

'ట్రంప్' సుంకాలపై మోదీ మౌనం వీడాలి


మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరావు

తణుకు అర్బన్: భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధిస్తే దేశ ప్రధాని మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని, మౌనం వీడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం తణుకు రోటరీ క్లబ్ హాల్‌లో సీపీఎం జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన దేశంపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని, ట్రంప్ విధిస్తున్న సుంకాల వలన రాష్ట్రంలో ఆక్వా రైతులపై పెనుభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, నాయకులు మంతెన సీతారాం, పీవీ ప్రతాప్, చింతకాయల బాబూరావు, కేతా పద్మ జేఎస్‌వీ గోపాలన్, కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

భీమవరం: నేటి ఆధునిక సమాజంలో విద్యార్థుల ఎదుగుదలకు వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమైనదని, స్నేహభావం, మంచి వాక్చాతుర్యం పెంపొందించుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఆకుల వెంకటశేషసాయి అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకట శేషసాయి మాట్లాడుతూ విద్యా రంగాన్ని ర్యాగింగ్, మాదక ద్రవ్యాలు తీవ్రంగా బాధిస్తున్నాయని, వాటి నుంచి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగ రాజు మాట్లాడుతూ తమ కళాశాలకు జాతీయ స్థాయి అక్రిడేషన్ ఉండడంతో నాణ్యమైన విద్యను అందించడానికి యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం రిటైర్డ్ న్యాయమూర్తి వెంకటశేషసాయిని సత్కరించారు.

యూరియాను అందించలేని ప్రభుత్వమిది

ఆకివీడు: కూటమి ప్రభుత్వం ఏడాదిగా రైతులకు ఏవిధమైన సౌకర్యాలు కల్పించలేదని, వ్యవసాయం దండగ అన్నట్లుగానే పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సరిపడే యూరియా ఎరువుల్ని అందుబాటులోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు. సొసైటీలకు మొక్కుబడిగా యూరియాను సరఫరా చేసి, మైళ్ల దూరం వెళ్లి రైతుల్ని తెచ్చుకోమనడం దారుణమన్నారు. సొసైటీలకు సరఫరా చేసిన యూరియా బడా, కూటమి రైతులకే వెళుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. అన్నదాతల పట్ల రాజకీయం తగదని సీతారామయ్య హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ నేతలకు 'కారుమూరి' పరామర్శ


వైఎస్సార్ సీపీ నేత వెంకటపతిరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

అత్తిలి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబాలను పరామర్శించారు. అత్తిలి మండలం కంచుమర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మెత్స వెంకటపతిరాజు అత్త ఇటీవల మృతి చెందడంతో వెంకటపతిరాజు కుటుంబసభ్యులను కారుమూరి పరామర్శించి సంతాపం తెలిపారు. అత్తిలి మండలం ఎర్రనీలిగుంట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పెచ్చెట్టి సత్యనారాయణ మాతృమూర్తి నాగరత్నం ఇటీవల మృతి చెందడంతో సత్యనారాయణ కుటుంబసభ్యులను కారుమూరి పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దరాతి భరణీప్రసాద్, మాజీ సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరిరాజు, ఎంపీటీసీ త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రతి బస్సులోనూ పురుషులకు సీట్లు కేటాయించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆగస్టు పదిహేను నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నందున బస్సులు అన్నీ లేడీస్‌తో నిండిపోయే అవకాశం ఉన్నందున, ప్రతి బస్సులోనూ మగవారికి ప్రత్యేక సీట్లు కేటాయించాలని ఏపీ స్టేట్ కన్స్యూమర్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఏఆర్‌కే హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎంకు, ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్, వెలగపూడి కార్యాలయానికి వినతులు పంపారు.

'ఐడీబీఐ' ప్రైవేటీకరణను అడ్డుకుంటాం


బ్యాంక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని బ్యాంక్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి టీవీ సూర్యనారాయణ పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తలపెట్టిన ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిరసిస్తూ సోమవారం బ్యాంక్ ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. బ్యాంక్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగుల కో–ఆర్డినేషన్ కమిటీ నాయకులు నిరసనలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంక్‌లు దేశానికి వెన్నెముక, దేశ సంపద అని వ్యాఖ్యానించారు. యాభై సంవత్సరాలు చరిత్ర కలిగి లాభాల్లో ఉన్న ప్రభుత్వ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఆపుతామని తెలిపారు. భవిష్యత్తులో పోరాటాలను ఉధృతం చేస్తామని చెప్పారు. ఏఐబీఈఏ నిర్ణయాత్మక పాత్ర వహిస్తుందని, అవసరమైతే దేశ వ్యాప్త బ్యాంకు సమ్మెకు వెళతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎస్ఎస్ ప్రసాద్, నాయకులు బి.ఏడుకొండలు, జీఎస్‌వీ ప్రకాష్, పాలూరి సత్యనారాయణ, కె.శ్రీనివాస్, సిద్దాబత్తుల సూర్యనారాయణ, షరీఫ్, ఎం.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హరేకృష్ణ మహోత్సవం


రాధాకృష్ణులకు మహాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

తణుకు అర్బన్ : శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాల్లో భాగంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో తణుకు శ్రీభోగవల్లి బాపయ్య, అన్నపూర్ణమ్మ కమ్మ కల్యాణమండపంలో సోమవారం రాత్రి నిర్వహించిన హరేకృష్ణ మహోత్సవం భక్తులను అలరించింది. ఈ సందర్భంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీరాధాకృష్ణులకు మహాభిషేకాన్ని కనుల పండువగా నిర్వహించారు. కృష్ణ భగవానుడికి హరినామ సంకీర్తన, ప్రవచనం, జవ మెడిటేషన్, అభిషేక సేవ దాతలచే వెన్న ముద్ద, గోపాలుడికి స్వీయ హస్తాలతో అభిషేక ఘట్టం, చప్పనభోగ సమర్పణ, మహా హారతి, మహా ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను భక్తులు వీక్షించారు. వేలాదిగా హాజరైన భక్తుల హరేకృష్ణ నామస్మరణలతో వేదిక ప్రాంతం భక్తి భావంతో నిండిపోయింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఇస్కాన్ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి మురళీనాథ్ శ్యామ్‌దాస్, ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా చెత్త సంపద కేంద్రాలు

- గ్రామ శివార్లలో చెత్తాచెదారాలు
- కానరాని సంపద తయారీ
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం


నిరుపయోగంగా ఉన్న వెంకట్రామన్నగూడెం చెత్త సంపద కేంద్రం

తాడేపల్లిగూడెం రూరల్: చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు గ్రామాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎస్‌డబ్ల్యూఎం షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. గ్రామాల్లో ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడిగా విభజించి నాడెప్ పిట్లలో వేసి వర్మీకంపోస్టు చేయవలసి ఉంది. అయితే ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను శాగ్రిగేషన్ చేయకుండా డంపింగ్ యార్డుకు సమీపంలో రహదారి పక్కన వేసి తగలబెట్టడం గమనార్హం. తాడేపల్లిగూడెం మండలంలోని 28 గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రహదారిన పోయే వాహనదారులు చెత్తా, చెదారాల నుంచి వస్తున్న దుర్గంధం, పొగ కారణంగా ముక్కులు మూసుకోవలసిన పరిస్థితి వస్తోంది. పలు గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూఎం షెడ్లు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించి, తాళాలు వేశారు. వెంకట్రామన్నగూడెం, దండగర్ర, మెట్ట ఉప్పరగూడెం, కడియద్ద, మోదుగగుంట, అప్పారావుపేట, కొమ్ముగూడెం, రామన్నగూడెం, మాధవరం తదితర గ్రామాల్లో రక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. నాడెప్ పిట్లలో మద్యం సీసాలు దర్శనమివ్వడం ఇందుకు నిదర్శనం. ఏటా చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణా తరగతులకే ఈ షెడ్లు పరిమితమైనట్లు కనిపిస్తోంది. ఆ సమయంలో మాత్రమే షెడ్లను శుభ్రం చేయడం విశేషం. ఏ గ్రామంలోనూ చెత్త నుంచి సంపద తయారీ దాఖలాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. చెత్త సంపద తయారీ కేవలం మాటలకే పరిమితమవుతుందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా, ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారీ ప్రక్రియ చేపట్టి, వాటిని సద్వినియోగం చేయాలని ప్రజలు కోరుతున్నారు.


చెత్త సంపద కేంద్రంలో మద్యం సీసాలు


చెత్త సంపద కేంద్రానికి సమీపంలో తగలబెట్టిన చెత్త